## క్లుప్తంగా

### ఎరువులు అందుబాటులో ఉంచండి




సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ దైవకుమార్

పెద్దాపురం: గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద ఎరువులను అందుబాటులో ఉంచాలని ఏడీఏ దైవకుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. రబీ సీజన్‌కు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని, పీఎం కిసాన్ ఈకేవైసీ పూర్తి చేయాలని, నానో యూరియాపై రైతులకు మరింత అవగాహన ఏర్పరచాలని దైవకుమార్ సూచించారు. మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి రాకేష్ మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధులు రాకుండా పశువులకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. ఉద్యాన శాఖనుంచి చిలకమ్మ, ఏఈఓ ప్రసాద్, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

### నేడు లక్ష తులసి పూజ



వేట్లపాలెంలో దేవేరులతో వేంకటేశ్వరస్వామి

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష తులసి పూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ధనుర్మాసం, శ్రవణ నక్షత్రంను పురస్కరించుకొని ఏటా లక్ష తులసీ పూజలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఫిబ్రవరి 19 నుంచి 24 వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

### వైఎస్సార్ బీమా అందజేత



బాధితులకు బీమా సొమ్ము అందిస్తున్న కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట: ఇటీవల మృతి చెందిన మురపాక శ్రీనివాసు, దూల వీరయ్య కుటుంబాలకు సచివాలయ సిబ్బంది తక్షణ సాయంగా వైఎస్సార్ బీమాలో పాక్షికంగా రూ.10 వేలు చొప్పున అందజేశారు. శుక్రవారం మిగిలిన రూ.90 వేలు రావడంతో 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు బాధితులు మురపాక సుబ్బలక్ష్మి, దూల శాంతిలకు ఆ మొత్తాన్ని అందజేశారు.

### పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: సంక్రాంతి సందర్భంగా పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. కరోనా కాలంలో కార్మికుల సేవలు మరువలేనివని ఆమె అన్నారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్లు నేతల హరిబాబు, స్వయంభారపు వీరభద్రరావు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, మున్సిపల్ మేనేజరు అచ్చుత రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి. శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఈఈ ఫిర్యాదులో వాస్తవం లేదు

కాకినాడ సిటీ: కిర్లంపూడి మండలం రాజుపాలెంలో పెద్దాపురం ఈఈ వెంకటేశ్వరరావుపై దాడి చేసినట్లు చేసిన ఫిర్యాదులో ఎటువంటి వాస్తవం లేదని రాజుపాలెం గ్రామస్తులైన కండెల్లి సతీష్, కొల్లి చంద్రరావు, గెడ్డం చిరంజీవి, పలివెల జనార్దనరావు శుక్రవారం జేసీ ఎస్.ఇలక్కియను కలిసి విన్నవించారు. ఈఈ వెంకటేశ్వరరావు కలెక్టరేట్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై జేసీ శుక్రవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా పై ముగ్గురు మాట్లాడుతూ కిర్లంపూడి మండలం రాజుపాలెం–రాయవరం రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యంపై ఈఈని ప్రశ్నించామన్నారు. దీంతో ఆయన తనను ప్రశ్నించడానికి మీరెవరని దూషించారని వారు పేర్కొన్నారు. ఈ విషయమై తాము కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామన్నారు. అయితే పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు జేసీకి వివరించారు.

# రోడ్డెక్కిన వ్యాపారం..

- మార్కెట్ షెడ్లున్నా నిరుపయోగం
- మూలపేట, అమీనాబాద్‌లో పరిస్థితి

కొత్తపల్లి: నిత్యం రద్దీగా ఉండే రోడ్లపైకే చేపల వ్యాపారం వచ్చింది.. మార్కెట్ షెడ్లున్నా వ్యాపారులు రహదారులనే వ్యాపార కేంద్రంగా మార్చుకోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కొత్తపల్లి మండలం అమీనాబాద్, మూలపేట, కొనపాపపేట గ్రామాల్లో పరిస్థితి ఇది. గతంలో ప్రభుత్వం చేపల వ్యాపారులకు ప్రత్యేకంగా షెడ్లను నిర్మించింది. వాటిని విడిచిపెట్టి ప్రధాన రోడ్లు, ప్రైవేట్ స్థలాల్లో వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనివల్ల రహదారులు ఇక్కచిక్కి నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఉప్పాడ– కోనపాపపేట బీచ్ రోడ్డులో మూలపేట, అమీనాబాద్ సెంటర్‌లో చేపల వ్యాపారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా ఆదివారం మత్స్యకార మహిళలు రోడ్డుపైనే చేపలను విక్రయిస్తున్నారు. కొనుగోలు దారులతో రోడ్డు కిక్కిరిసిపోతుంది. గంటల కొద్దీ ట్రాఫిక్ చిక్కుముడి వీడడం లేదు. దీనివల్ల రోడ్లపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎందుకో వదిలేశారు..**

అమీనాబాద్‌లో చేపల మార్కెట్ నిర్వహణకు కొన్నేళ్ల కిందటే రూ.లక్షలతో షెడ్లు నిర్మించారు.



ఉప్పాడ బీచ్ రోడ్డులో వ్యాపార లావాదేవీలతో స్తంభించిన ట్రాఫిక్

మూలపేటలోని ఫిషరీష్, ఉపాధిహామీ నిధులు రూ.9 లక్షలతో మార్కెట్ షెడ్డు అందుబాటులోకి వచ్చింది. ఈ షెడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఇక్కడ మత్స్యకారులు వలలు అల్లుకోవడం, ప్రైవేట్ వ్యక్తులు తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇలా షెడ్లు పూర్తిస్థాయిలో నిరుపయోగంగా మారాయి.

**ప్రైవేట్ స్థలంలో మార్కెట్**

అమీనాబాద్‌లో చేపల వ్యాపారులు మార్కెట్‌ను ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తుతున్నారు. మూలపేటలోని మార్కెట్‌ను బీచ్‌రోడ్డులోని జిల్లా పరిషత్ పాఠశాల పక్కనే నిర్వహిస్తుండడంతో అక్కడే



మూలపేటలో నిరుపయోగంగా మార్కెట్ షెడ్డు

చేపల వ్యర్థాలను వేయడంతో దుర్వాసన వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్ షెడ్‌లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. తద్వారా బీచ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య కూడా తొలగిపోతుంది.

**షెడ్లను వినియోగించుకోండి**

చేపల వ్యాపారం రోడ్లపై నిర్వహించరాదని ఇప్పటికే వ్యాపారులకు సూచించాం. ఈ మేరకు అనేక సార్లు హెచ్చరికలు జారీ చేశాం. మూలపేటలో వారి కోసం చేపల షెడ్లు అందుబాటులో ఉన్నాయి. అక్కడ వ్యాపారం చేసుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాం. వాటిని వినియోగించుకోవాలి.

– వల్లీ, పంచాయతీ కార్యదర్శి, మూలపేట

**చర్యలు తీసుకుంటాం**



ఉప్పాడ– మూలపేట బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. అమీనాబాద్‌లో వ్యాపారులు రోడ్లపైనే చేపల వ్యాపారం చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వ్యాపారులు రోడ్లపై వ్యాపారం నిర్వహించకుండా సూచనలు చేస్తాం. వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– స్వామినాయుడు, ఎస్సై, కొత్తపల్లి

## ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



సామర్లకోట నీలమ్మ చెరువు వద్ద ముగ్గులు వేస్తున్న మహిళలు

సామర్లకోట: మదర్‌థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు సహకారంతో 20 వార్డు కౌన్సిలర్ చిట్టుమాని రాఘవ శుక్రవారం సాయంత్రం స్థానిక నీలమ్మ చెరువు వద్ద ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 14 మంది మహిళలు పాల్గొనగా అందరికీ బహుమతులు అందజేశారు. వారిలో ప్రథమ బహుమతిని సీహెచ్ సాందిని, ద్వితీయ బహుమతిని వై.పూర్ణ, తృతీయ బహుమతి ఎం.మహాలక్ష్మి గెలుచుకున్నారు.

**మాధవపట్నంలో..**

సామర్లకోట: మండల పరిధిలో మాధవపట్నం గ్రామంలో శుక్రవారం సాయంత్రం పంచాయతీ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు, సచివాలయ సిబ్బంది ముగ్గులను పరిశీలించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బహుమతులు అందజేశారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే దొరబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

పిఠాపురం: నిరంతరం ప్రజల కోసమే ఎమ్మెల్యే పెండెం దొరబాబు పనిచేస్తున్నారని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబి అన్నారు. పిఠాపురంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను అభిమానుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన నేతలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు ఆయనను దుశ్శాలువాలు, పూల మాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ముఖ్య అతిథులుగా పాల్గొని వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పించి, ఆయన సూక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ అధినేత రాజు ఏర్పాటు చేసిన నిత్యావసర సరకులను పేదలకు అందజేశారు. మాజీ కౌన్సిలర్ కాళ్ల లక్ష్మీనారాయణ, శ్రీభీమేశ్వర జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అడపా వెంకట్రావు, కానిస్టేబుల్స్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, బసివిరెడ్డి సత్రం యజమానులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివేకాందుని చిత్రపటానికి నివాళులు అర్పించారు. వివేకానందుని సేవలను దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మేనేజరు అచ్యుతరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నీలమ్మ చెరువు వివేకానంద గ్రంథాలయం వద్ద ఉన్న వివేకానందుని విగ్రహానికి నివాళులు అర్పించారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సమితి నాయకులు కర్రి ఆదినారాయణరెడ్డి కంచర్ల రామకృష్ణ, కాపుగంటి పైడిరత్నం తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పించిన దవులూరి సుబ్బారావు

**భగవద్గీత ఆలయంలో..**

పెద్దాపురం: స్థానిక సత్తిరెడ్డిపేట భగవద్గీత ఆలయంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశభక్తి, ఆధ్యాత్మికత అలవరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. . సమితి ఆర్గనైజర్ సత్యకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన సాంస్కృత పండిట్ దర్భా వెంకటశర్మ, ఆర్గనైజర్ సత్యకుమార్, నేతి వీరభద్రరావు, కృష్ణదేవ మనోహర్, వేదగీతామృత, అంబిక, శ్రీదేవి, రామచరణ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన మల్లికార్జునస్వామి

అలాగే పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఆర్.సత్య అధ్యక్షతన జరిగిన వేడుకలో ఓ విద్యార్థి వివేకానందుని వేషధారణలో ఆకట్టుకున్నాడు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



వేట్లపాలెంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దవులూరి దొరబాబు

- నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి
- వేట్లపాలెంలో అభివృద్ధి పనుల ప్రారంభం

సామర్లకోట: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలో వేట్లపాలెంలో రూ.1.46 కోట్లతో జరిగిన అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ పని చేస్తున్నారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల సందర్భంగా గ్రామాల్లో పర్యటించిన సమయంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలోని రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి రూ.80 లక్షలతో పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. అలాగే రూ.43 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.21 లక్షలతో నిర్మించిన సచివాలయాలను ప్రారంభించారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరో పర్యాయం ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. స్థానికుడైన తనకు పెద్దాపురం నుంచి పోటీ చేసే అవకాశాన్ని ఆయన కల్పించారని, తనను గెలిపించాలని, ప్రజలకు మేలు జరిగేలా పని చేస్తానని చెప్పారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, పంచాయతీరాజ్ డీఈ భాస్కర్, సొసైటీ అధ్యక్షులు మలకల వరహాలరాజు, నర్ల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్‌లో విజేత 8వ సచివాలయం

**ఆసక్తిగా సాగిన షటిల్ బ్యాడ్మింటన్**

సామర్లకోట: పట్టణ స్థాయి క్రికెట్ పోటీలో విజేతగా 8వ సచివాలయం క్రీడాకారులు నిలిచారు. ఈ మేరకు వారిని 14వ వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, కమిషనర్ జె.రామారావు అభినందించారు. విజేతగా నిలచిన జట్టు నియోజకవర్గ పోటీల్లో పాల్గొంటారని కమిషనర్ తెలిపారు. ఫైనల్ మ్యాచ్ అమ్మనమ్మా అపార్టుమెంట్ 15వ సచివాలయం, బళ్లమార్కెట్ 1, 8వ సచివాలయం మధ్య హోరాహోరీగా జరిగింది. 10 ఓవర్ల మ్యాచ్‌లో 8వ సచివాలయం జట్టు 99 పరుగులు చేయగా 15వ సచివాలయం జట్టు 49 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలైంది. మండల స్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం క్రీడలు ఆసక్తిగా సాగాయి.

**ఉత్సాహంగా క్రీడా పోటీలు**

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం– ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో మూడో రోజైన శుక్రవారం కబడ్డీ, షటిల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు.



కొత్తపల్లిలో కబడ్డీ ఆడుతున్న యువతులు



సామర్లకోట మున్సిపాలిటీ స్థాయిలో విజేతగా నిలచిన క్రికెట్ జట్టు



సామర్లకోట మండల స్థాయి షటిల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

## రూ.16 లక్షల సబ్సిడీతో సెప్టీ క్లీనింగ్ ట్యాంకర్

సామర్లకోట: సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకరును గ్రూప్ సభ్యులకు రూ.16 లక్షలు సబ్సిడీతో అందజేసినట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. పట్టణ పరిధిలోని ఎస్సీలు ఐదుగురు గ్రూపుగా చేరడంతో పూజారి సుంకయ్యకు శుక్రవారం సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకరును అందజేసి ప్రారంభించారు. దీని విలువ రూ.32 లక్షలు కాగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీపై అందజేసినట్టు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సెప్టీ క్లీనింగ్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న దవులూరి సుబ్బారావు

## కృష్ణాలయంలో గోదా కల్యాణం

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులో విఘ్నేశ్వర ఆలయం ఎదురుగా ఉన్న రాధా కృష్ణ సమేత వేణు గోపాలస్వామి ఆలయంలో శుక్రవారం గోదా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసు ఆధ్వర్యంలో పూజలు, కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు.



సామర్లకోటలో గోదా కల్యాణం

## అంగన్‌వాడీలకు కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు మద్దతు

పెద్దాపురం: కనీస వేతనాలు అమలుచేయాలంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీడీ బ్ల్యూసీ సభ్యుడు మల్లిపూడి మంగపతి పళ్లంరాజు శుక్రవారం మద్దతు తెలిపారు. సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్ అధ్యక్షతలన జరిగిన సమ్మె శిబిరం వద్ద పళ్లంరాజు మాట్లాడుతూ వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించి, గ్రేట్2 సూపర్‌వైజర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.

# సంప్రదాయ క్రీడలకే ప్రాధాన్యమివ్వాలి

పిఠాపురం: సంక్రాంతి వేడుకల్లో సంప్రదాయ క్రీడలకే ప్రాధాన్యం ఇవ్వాలని, గుండాటలు, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం నియోజకవర్గంలో జూదాలు ఆడరాదంటూ పోలీసులు ప్రచారం నిర్వహించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు జూదాలను నిషేధించారని, ఎవరైనా గుండాటలు, కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి తదితర పోలీసుల ఆధ్వర్యంలో తహసీల్దార్లు, ఇతర అధికారులతో కలసి జాయింట్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఎవరైనా పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కోడి పందేలు, గుండాటలు ఆడేవారిని గుర్తించి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



గొల్లప్రోలులో జూదాలపై ప్రచారం చేస్తున్న గొల్లప్రోలు ఎస్సై బాలాజీ

కొత్తపల్లి: సంక్రాంతి పండగల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు.. కోడిపందేలు, పేకాట, గుండాట తదితర జూదాల జోలికి వెళ్లవద్దని పోలీసులు ఇంటింటా ప్రచారం చేశారు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు పర్యవేక్షణలో మండలంలో సిబ్బంది మైకు ద్వారా ప్రచారం నిర్వహించారు. ఎక్కడైనా కోడిపందేలు, పేకాటలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారాన్ని అందించాలన్నారు.



వీకే రాయపురంలో ప్రచారం చేస్తున్న పోలీసులు

**కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు**

సామర్లకోట: మండల పరిధిలో కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ డి.సురేష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కోడి పందేల ఏర్పాట్లను గమనించడానికి జాయింట్ కమిటీని ఏర్పాటు చేశామని, రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం పండ్రవాడ, అచ్చంపేట, వీకే రాయపురం, వేట్లపాలెంలలో ఏర్పాటు చేసిన టెంట్లను తొలగించామని తెలిపారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, సీఐ సురేష్, ఎస్సై మూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.